క్లుప్తంగా

ఎంపీడీఓగా సుబ్రహ్మణ్యశర్మ బాధ్యతల స్వీకరణ

కోటనందూరు: స్థానిక ఎంపీడీఓగా ఎస్. సుబ్రహ్మణ్యశర్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడే పని చేసిన ఎంపీడీఓ శర్మ ఎన్నికల బదిలీల్లో భాగంగా తాడేపల్లిగూడెంకు వెళ్లారు. మళ్లీ బదిలీల్లో ఇక్కడ వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన ఎంపీడీఓ జయమాధవి అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి వెళ్లారు.

తహసీల్దార్‌గా సుభాష్

స్థానిక తహసీల్దార్‌గా టి.శుభాష్ విధుల్లోకి చేరారు. సాధారణ బదిలీల్లో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఇక్కడ వచ్చారు. నూతన తహసీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు స్వాగతం పలికారు.

పశువుల అక్రమ రవాణాపై కేసు



పోలీసులు స్వాధీనం చేసుకున్న పశువులు

గండేపల్లి: జాతీయ రహదారిపై పశువులను అక్రమ రవాణా చేస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై యూవీ శివ నాగబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బొలెరో వ్యాన్‌లో తొమ్మిది 9 ఎద్దులను అక్రమంగా తరలిస్తున్న వ్యాన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. వాటిని గోకవరం వద్ద ఉన్న గోశాలకు తరలించినట్టు తెలిపారు.

దుప్పట్లు, పండ్ల పంపిణీ

కిర్లంపూడి: మాజీ ఎంపీటీసీ దివంగత కాళ్ల దొంగబాబు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని పలువురు వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. జగపతినగరం గ్రామ సర్పంచ మహేంద్రాడ శ్రీలత అధ్యక్షతన గురువారం పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన దొంగబాబు సంతాప సభకు జగ్గంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథి హాజరయ్యారు. దొంగబాబు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పలువురు వృద్ధులకు, శానిటేషన్ సిబ్బందికి దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దొంగబాబు కుమారులు, నాయకులు ఉన్నారు.

దుప్పట్లు, నిత్యావసరాల వితరణ

జగ్గంపేట: స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా రామవరంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జీ తుమ్మలపల్లి రమేష్ జాతీయ జెండా ఎగరవేశారు. అనంతరం పేదలకు దుప్పట్లు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు.

ఆర్‌ఎండీపీకి ఎంపీపీ ఎంపిక

ప్రత్తిపాడు: గుజరాత్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్ ఆనంద్‌లో ఈనెల 19వ తేదీ నుంచి 23 వరకు దేశవ్యాప్తంగా జరుగనున్న రెసిడెన్సియల్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగాం (ఆర్‌ఎండీపీ)కు ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రత్తిపాడు ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ ఎంపికయ్యారు. ఈ మేరకు పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ వీఆర్ కృష్ణతేజ మైలవరపు ఇచ్చిన ఉత్తర్వులు గురువారం అందాయని ఎంపీపీ సుధాకర్ తెలిపారు. ఈ ప్రోగ్రాంకు ఆంధ్రప్రదేశ్ నుంచి తనతో పాటు కర్నూలు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వై.పాపిరెడ్డి, పశ్చిమ గోదావరి జిల్లా జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పి.శ్రీలేఖ ఎంపికైనట్టు చెప్పారు. రాష్ట్రం నుంచి ముగ్గురు ప్రజాప్రతినిధులు, మరో ముగ్గురు అధికారులను (బాపట్ల డీడీఓ చంద్ర సువార్త, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు జి.నితిన్, ఎస్ దివిజ) కూడా ఎంపిక చేసినట్టు ఎంపీపీ సుధాకర్ తెలిపారు. దేశవ్యాప్తంగా జరిగే రెసిడెన్సియల్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగాంకు ఎంపికైన సుధాకర్‌ను ఎంపీడీఓ ఎస్.డేవిడ్ రాజ్, ఈఓఆర్డీ కేవీవీఎస్ కాశీ విశ్వనాథ, మండల విద్యాశాఖాధికారులు వి.రాజబాబు, వై.అచ్చిరాజు, మండల ఇంజనీరింగ్ అధికారి ఎన్.నాగేశ్వరరావు, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఎం కుమారస్వామి, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు అభినందించారు.

వనదుర్గ అమ్మవారి జాతర మహోత్సవాలు



ప్రధానార్చకుడు సుబ్రహ్మణ్యశర్మకు దీక్షా దుస్తులను అందజేసిన దేవస్థాన చైర్మన్ రోహిత్

తొండంగి: శ్రావణమాసం దశమి సందర్భంగా అన్నవరం రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారి జాతర మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. తొలిరోజు అమ్మవారిని బాల త్రిపుర సుందరిగా అలంకరించారు. ఈ సందర్భంగా దేవస్థాన ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ, 40 మంది రుత్విక్కులకు చైర్మన్ ఐవీ రోహిత్ దీక్షా వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన ఆలయ ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, వైదిక కార్యక్రమాల సలహాదారు నాగభట్ల కామేశ్వర శర్మ, కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు, అర్చకులు కోట వంశీ, పురోహితులు రవిశర్మ, రుత్విక్కులు పాల్గొన్నారు.



తుని సిటీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ పతాక ఆవిష్కరణ



రౌతులపూడిలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రాజ్యలక్ష్మి



ఏలేశ్వరంలో జెండా వందనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



జగపతినగరంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ శ్రీలత

త్రివర్ణ పతాక రెపరెపలు

- వాడవాడలా జాతీయ జెండా ఆవిష్కరణలు
- స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు
- పలు సేవా కార్యక్రమాలు
- గ్రామాల్లో పండగ వాతావరణం



అన్నవరంలో వంద మీటర్ల జాతీయ జెండాతో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు



రత్నగిరి కొండపై జాతీయ జెండాను ఎగుర వేసిన ఈవో రమేష్‌బాబు

తుని: ఎందరో త్యాగధనుల పోరాటం ఫలితంగా లభించిన స్వాతంత్రాన్ని రాష్ట్ర ప్రగతి కోసం కృషి చేయాలని పలువురు సమరయోధులు పిలుపునిచ్చారు. గురువారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకులను జరుపుకొన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే యనమల దివ్య, తుని పురపాలక సంఘంలో చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి మువ్వెన్నల పతాకాన్ని ఆవిష్కరించారు. జాతిపిత మహాత్మాగాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. గాంధీసత్రంలో చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, అమ్మాజీపేటలో వైఎస్సార్ సీపీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. మున్సిపల్ పాఠశాలలో పంద్రాఆగష్టు వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. తహసీల్దార్, తుని పట్టణ పోలీస్‌స్టేషన్, సబ్ రిజిస్ట్రార్, గృహ నిర్మాణ, రాజా ఉన్నత పాఠశాల, ఇందిరాసాగర్ కార్యాలయం, పెన్షనర్ల అసోసియేషన్, ఐసీడీఎస్, బీసీ ఐక్యవేదిక, విద్యుత్ శాఖల కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. తుని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలోను, వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలోను వేడుకలు జరిగాయి. శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో తుని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్థానిక కొండవారిపేట బ్రహ్మల కాలనీలో మహిళా మండలి అధ్యక్షురాలు విజయలక్ష్మి, బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ శేఖర్ జాతీయ జెండాను ఎగురవేశారు.

దేశంలో అసమానతలు తొలగిపోవాలి

తుని రూరల్: దేశంలో అసమానతలు, ప్రజల మధ్య అంతరాయం తొలగిపోవాలని ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు అన్నారు. గురువారం తేటగుంట క్యాంపు కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య, ఐఆర్‌ఎస్ అధికారి గోపినాథ్, మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు పాల్గొన్నారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఎన్టీ రామారావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి, జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం యనమల ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు రూ.వెయ్యి చొప్పున 200 మందికి ఆర్థిక సాయం అందజేసి, సంపక్తి భోజనాలు ఏర్పాటు చేశారు.

కోటనందూరు మండలంలో..

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మువ్వన్నెల జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శుభాష్, కోపరేటివ్ సొసైటీలో టీడీపీ నేత గాడి రాజబాబు జాతీయ జెండాను ఎగుర వేశారు. అల్లిపూడి కేజీబీవీలో ఎస్ఎంసీ చైర్మన్‌తో కలిసి ఎస్ఓ రాజేశ్వరి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

100 మీటర్ల జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ

తొండంగి: అన్నవరంలోని శారదా విద్యానికేతన్, వాసవీక్లబ్ ఆఫ్ అన్నవరం ఆర్యవైశ్య సంఘం అన్నవరం సంయుక్తాధ్వర్యంలో వంద మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ చేశారు. శారదా విద్యానికేతన్ ఆవరణలో విద్యార్థులు జాతీయ జెండాతో మానవహారం నిర్వహించారు. అనంతరం వాసవీ క్లబ్ ఆఫ్ అన్నవరం ఆర్యవైశ్య సంఘం సభ్యులతో కలసి గ్రామ పురవీధుల్లో ర్యాలీ చేశారు. ›

మండలంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఒంటిమామిడి దివీస్ ల్యాబోరేటరీస్ ప్రాంగణంలో జనరల్ మేనేజర్ వి.నాగేశ్వర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

రత్నగిరిపై స్వాతంత్ర్య దినోత్సవం

ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం రత్నగిరి కొండపై స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొండపై కళామందిరం వద్ద ప్రాంగణంలో దేవస్థాన ఇన్‌చార్జి ఈఓ రమేష్‌బాబు జాతీయ పతాకాన్ని ఎగుర వేసి వందనం చేశారు.

ఏలేశ్వరంలో..

ఏలేశ్వరం: భారత దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుని నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం వాడవాడలా త్రివర్ణపతాకం రెపరెపలాడింది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, కార్యాలయాల్లో మూడు రంగుల జెండాను ఆవిష్కరించారు. దీంతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. ఏలేశ్వరం నగర పంచాయతీ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాల వద్ద జాతీయ పతాకాన్ని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, ఎంఈఓ అబ్బాయి, నాయకులు తదితరులు పాల్గొన్నారు. స్థానిక షిర్డీనగర్ సచివాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లు సామంతుల హైమావతి, దోే కిషోర్ జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్, ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు : మండలంలోని గ్రామగ్రామాన మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ ఎంవీఆర్ ఎస్.డేవిడ్‌రాజ్ ఆధ్వర్యంలో జరిగిన స్వాతంత్ర వేడుకలకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ముఖ్యఅతిథిగా పాల్గొని, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలైన వారికి ఆమె బహుమతులను అందజేశారు. స్థానిక సచివాలయాలు, ప్రభుత్వ వసతిగృహాల వద్ద సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, స్థానిక కోర్టు పెద్దాపురం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.బుల్లెమ్మ, ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రిజిస్ట్రార్ టి.సుబ్బారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.



గండేపల్లి ఎంపీడీఓ కార్యాలయం వద్ద పతాక ఆవిష్కరణలో పాల్గొన్న ఎంపీపీ, తదితరులు



మహాత్మా గాంధీ, అంబేడ్కర్, ఎన్టీఆర్ చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ రామకృష్ణుడు, ఎమ్మెల్యే దివ్య



ఏలేశ్వరంలో జాతీయజెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



వి.కొత్తూరులో 78వ ఇండిపెండెన్సీడే ఆకారంలో విద్యార్థినుల ప్రదర్శన

శంఖవరం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో స్వాతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మూడు రంగుల జెండాను ఆవిష్కరించారు.

రౌతులపూడి: మండలంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, కార్యాలయాల్లో అధికారుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జి.రాజ్యలక్ష్మి మూడు రంగుల జెండాను ఆవిష్కరించారు.

గోకవరం మండలంలో

గోకవరం: మండలంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ సమీపంలో వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పార్టీ నాయకులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, పార్టీ నాయకులు దాసరి చినబాబు, సుంకర వీరబాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, సుంకర వెంకటరమణ, కర్రి సూరారెడ్డి, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, ఎంపీటీసీ తోలేటి రమ్యశ్రీ, నరాలశెట్టి నర్శయ్య, తోలేటి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.రజని, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై పవన్‌కుమార్, ది గోకవరం ప్రెస్‌క్లబ్ కార్యాలయం వద్ద అధ్యక్షుడు ఆర్.పండు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

కిర్లంపూడి: మండలంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తోట రవి, జగపతినగరం పంచాయితీలో సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో జె.చిరంజీవి, కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై.జి.సతీష్ జాతీయ పతాకాన్ని ఎగరవేశారు.

గండేపల్లి: స్థానిక మండల అభివృద్ధి కార్యాలయం వద్ద ఎంపీపీ చలగళ్ల దొరబాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై యూవీ శివనాగబాబు, సిబ్బంది, రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్, సిబ్బంది పాల్గొన్నారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి జెండా వందన చేశారు.

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కాలేజి, గురుకుల పాఠశాల, పంచాయతీ కార్యాలయం, టౌన్‌హాల్‌లో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ జెండా ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు. జగ్గంపేట పోలీసు స్టేషన్‌లో సీఐ లక్ష్మణరావు జెండా ఎగరవేశారు.



జగ్గంపేటలో జాతీయజెండా ఎగురవేసి వందనం చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



తునిలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఉదయరేఖా మహిళా మండలి ప్రతినిధులు



కోటనందూరులో జాతీయజెండాను ఎగురవేస్తున్న ఎంపీపీ శ్రీనివాసు



తొండంగిలో జెండా వందనం చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత



గోకవరంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

తుని రూరల్: మండలంలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. స్థానిక మండలం పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము జాతీయ జెండాను ఆవిష్కరించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ప్రసాద్, లోవ దేవస్థానంలో ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు, కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి, గ్రామ పంచాయతీల్లో సర్పంచులు, పాఠశాలల్లో యాజమాన్య కమిటీ చైర్మన్లు జెండాను ఎగురవేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు 78వ ఇండిపెండెన్సీడే ఆకారంలో ఏర్పాడి అబ్బురపర్చారు. కోలాటం ప్రదర్శించిన విద్యార్థినులను ప్రోత్సహిస్తూ రూ.2500లను బహుకరించి, పీడీ పద్మను అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ రవికుమార్, ఎంఈఓ పరవాడ గీతాదేవి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.









ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న చిరంజీవి, వీరబాబు, సత్యనారాయణ, మురళీకృష్ణ





వైద్య ఆరోగ్య శాఖాధికారి నరసింహనాయక్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రాంబాబు, వెంకటప్రభ



విజయవాడలో అవార్డు అందుకుంటున్న చెల్లారావు

ఉత్తమ సేవా అవార్డులు

ప్రత్తిపాడు: భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకున్ని ఉత్తమ సేవలు కనబరచిన ఇద్దరు ఉద్యోగులు ఉత్తమ సేవా అవార్డులు అందుకున్నారు. జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సమక్షంలో ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా ప్రత్తిపాడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ఎల్ చిరంజీవి అవార్డు అందుకున్నారు. పెద్దిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్‌గా సేవలు అందిస్తున్న ఏపీ ఎన్‌జీఓ సంఘ అధ్యక్షుడు రామిశెట్టి రాంబాబు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ నరసింహనాయక్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

ఏవీ నగరం పీహెచ్‌సీ నర్స్ వెంకటప్రభకు...

తొండంగి: కాకినాడలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా ఉత్తమ సేవలందించిన ఎ.వి.నగరం పీహెచ్‌సీ నర్సు చందక వెంకట ప్రభకు అవార్డు లభించింది. ఈ మేరకు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి నరసింహనాయక్ ఆమెకు అవార్డును అందజేశారు. ఆమెను పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రమికుమార్, వైద్యురాలు పి.భారతి, ఇతర సిబ్బంది అభినందించారు.

కానిస్టేబుల్ వీరబాబుకు..

గండేపల్లి: స్థానిక గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఆడారి వీరబాబుకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. గురువారం కాకినాడలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ఉత్తమ సేవ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వీరబాబుకు ఎస్సై శివ నాగబాబు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

లైన్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణకు...

తుని: స్థానిక విద్యుత్ శాఖలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ఎస్.మురళీకృష్ణకు ఉత్తమ సేవా పురస్కారం వరించింది. విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించినందుకు ఈ అవార్డు దక్కింది. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యుత్‌శాఖ రాజమహేంద్రవరం ఎస్ఈ కె.తిలక్‌కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. మురళీకృష్ణను సహోద్యోగులు అభినందించారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు ...

రౌతులపూడి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా సేవలందిస్తున్న వీవీవీ సత్యనారాయణకు ఉత్తమ్మ అవార్డు వరించింది. కాకినాడలో 78వ స్వాతంత్ర వేడుకల సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. వీఆర్వోలు, సిబ్బంది ఆయనకు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

ఆర్టీసీ ఉద్యోగి చెల్లారావుకు..

కోటనందూరు: పాతకొట్టాం గ్రామానికి చెందిన యడ్ల చెల్లారావుకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. చెల్లారావు ఏపీఎస్ఆర్‌టీసీ కేంద్ర కార్యాలయం విజయవాడలో వ్యాపార విభాగంలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 486 బస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న 6,200 వ్యాపార దుకాణాల స్థితిగతులను తెలుసుకునేందుకు చెల్లారావు సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేశారు. సాఫ్ట్‌వేర్ రూపకల్పనలో కృషి చేసిన చెల్లారావును సంస్థ ఎండీ, రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు అభినందించి, బహుమతి ప్రకటించారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఈడీ బ్రహ్మానందరెడ్డి ప్రశంసాపత్రం, నగదు పురస్కారాన్ని చెల్లరావుకు అందజేశారు.

నేడు వరలక్ష్మీదేవి వత్రం

ఏలేశ్వరం: శ్రావణమాసంలో మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీదేవివ్రతం నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం జరుపుకోనున్నారు. తమ కుటుంబం సుఖసంతోషాలతో కలకాలం ఆనందంగా ఉండాలని తాము ముత్తైదువులుగా జీవించాలని కోరుకుంటూ వరలక్ష్మీదేవి వ్రతాన్ని మహిళలు ఆచరిస్తారు. ఈ వ్రతాన్ని పురస్కరించుకుని మండలంలోని అమ్మవారి ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పట్టణంలోని పల్లపువీధిలోని కన్యకాపరమేశ్వరీ ఆలయం, తోటవీధి, ఆర్టీసీ డిపో, మార్కెట్‌వీధి, దిబ్బలపాలెం, నర్సీపట్నంరోడ్‌లలోని దుర్గాదేవి ఆలయాలను ముస్తాబు చేశారు. ఆలయాల్లో మహిళలు లలిత సహస్రపారాయణ, విష్ణుసహస్ర, గోవిందనామాలు పఠించనున్నారు. సాయంత్రం ఆలయాల వద్ద మహిళల రద్దీ ఎక్కువగా ఉంటుంది.

ఆకాశనంటుతున్న ధరలు

వరలక్ష్మీదేవి వత్రం పురస్కరించుకుని ధరలు ఆకాశనంటుతున్నాయి. అమ్మవారికి పెట్టే బంగారురూపులు ధరలు విపరీతంగా పెరిగాయి. ఒక గ్రాము బంగారం రూ.7350 ఉండగా గ్రాము రూపు విక్రయిస్తున్నారు. బంగారురూపు పెట్టడం ఆనవాయితీ కావడంతో భారమైన వాటిని మహిళలు కొనుగోలు చేస్తున్నారు. పూజకు యాపిల్, బత్తాయిలు, దానిమ్మ, జామ, కలువపువ్వులు, పత్రిలను కొనుగోలు చేశారు. పూజకు ముఖ్యమైన చామంతిపూలు ధరలు విపరీతంగా ఉన్నాయి, నాలుగు పువ్వులను రూ.10లకు విక్రయించారు. గురువారం సంతరోజు కావడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి జనం తరలివచ్చారు. దీంతో జ్యూయలరీ షాపులు మహిళలతో కిటకిటలాడాయి. కాగా స్థానిక హనుమాన్‌జంక్షన్‌లో అన్ని రకాల పండ్లతోపాటు పత్రిలను ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయించారు.



ఏలేశ్వరం హనుమాన్ జంక్షన్‌లో పండ్లు, పత్రి కొనుగోలు చేస్తున్న దృశ్యం

సూపర్ సిక్స్‌లో రెండు వికెట్లు డౌన్

మాజీ మంత్రి తోట నరసింహం

జగ్గంపేట: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకు ఒక్కక్కటిగా అసెంబ్లీ సాక్షిగా ఎగనామం పెడుతోందని, ఇప్పటికే సూపర్ సిక్స్‌లో రెండు వికెట్లు డౌన్ అయ్యాయని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా జగ్గంపేటలో వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో ఆయన జెండా ఎగరవేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలలో మహిళలను ఆకట్టుకొనేందుకు ఇష్టానుసారం హామీలు గుప్పించి ఇప్పుడు ఎగనామం పెడుతున్నారని కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అమ్మకి వందనం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు హామీలను అసెంబ్లీ సాక్షిగా ప్రస్తుతానికి లేనట్లే ప్రకటించారని ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో చిత్తశుద్ధితో పాలన చేశారని, క్యాలెండర్లు ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేసిన దమ్ము ఉన్న నాయకుడని ప్రశంసలు కురిపించారు. ఈ కార్యక్రమంలో తోట రాంజీ, నియోజకవర్గానికి చెందని పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



జగ్గంపేటలో జాతీయ జెండా ఎగరవేస్తున్న మాజీ మంత్రి తోట నరసింహం